జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

సోమవారం 21 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8

## ప్లెక్సీల్లో దళిత ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టకపోవడంపై మంచిర్యాల పట్టణంలో నిరసన



# వేట్‌లో కొనేసి.. అక్రమాలకు బాటేసి



**ఆదిలాబాద్**

అనువైన వాతావరణం.. అపారమైన వనరులున్నా.. చేప పిల్లల విత్తనోత్పత్తిపై అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఫిష్ సీడ్ ఫాంలలో చేప పిల్లల పెంపునకు అవకాశముంది. కానీ ఏటా మత్స్యశాఖ రూ.5 కోట్లు వెచ్చించి ప్రైవేట్‌గా చేపపిల్లలను కొనుగోలు చేస్తోంది. ఇది గుత్తేదారులకు వరంగా మారింది. ప్రభుత్వం ఏటా టెండర్లు నిర్వహించి ఉమ్మడి జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలు వదిలే బాధ్యత గుత్తేదారులకు అప్పగిస్తోంది. రూ. కోట్లు వెచ్చించి కొనుగోలు చేస్తున్నా.. ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. నాసిరకం, నాణ్యత లేనివి, పరిమాణం తక్కువగా ఉండే చేప పిల్లలను వదిలి గుత్తేదారులు అక్రమాలకు పాల్పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులతోపాటు అనేక చిన్ననీటి వనరులు ఉన్నాయి. ఉన్న నీటి వనరుల్లో అయిదు కోట్ల చేపలు ఉత్పత్తి చేసేందుకు వీలున్నా ప్రభుత్వం దృష్టి సారించలేదు. సాత్నాల, కడెం ప్రాజెక్టుల పరిధిలో మత్స్య విత్తన క్షేత్రాలు ఉన్నాయి. జిల్లాలో 60 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. ఇందులో 25 వేల మంది మత్స్య పరిశ్రమ వల్ల ఉపాధి పొందుతున్నారు. 207 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. మత్స్యకారులకు ఉపాధితో పాటు, యువతను ప్రోత్సహించేందుకు గతంలో కడెంలో కేజ్(బోన్) కల్చర్ పద్ధతిలో చేపల పెంపకం చేపట్టారు. నీటి ఉధృతికి అది కొట్టుకుపోయింది. సాత్నాలలో ఏకో హాచరీని ఏర్పాటు చేశారు. మూడు రోజుల వయసున్న చేపపిల్లలను తీసుకొచ్చి ఫీడింగ్ ఇస్తే అవి 35-45 సైజు వరకు పెరుగుతాయి. దీన్ని ప్రారంభించక ముందే ఇక్కడి నుంచి పోచంపాడ్‌కు తరలించారు.

# యాదవుల హక్కుల కోసం ముందుంటా..



...యాదవుల సామాజిక, రాజకీయ, ఆర్థిక ఎదుగుదలే లక్ష్యం
...యాదవులంతా ఐక్యంగా సంఘటితం కావాలి.

జిల్లాలోని 18 మండలాల్లో పటిష్టమైన కమిటీలు ఏర్పాటు చేస్తాం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్



## ప్రశాంత నిమజ్జనానికి ప్రజలు సహకరించాలి. సిఐ రమణా మూర్తి

**గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సి.ఐ,ఎస్.ఐ**




**జన్నారం,సెప్టెంబర్20(ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని పొన్కల్ మరియు కలమడుగు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశాలను లక్సెట్టిపేట్ సీఐ రమణ మూర్తి జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తో కలిసి శనివారం సంయుక్తంగా సందర్శించి పరిశీలించారు.నిమజ్జన ప్రదేశాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, బారికేడ్లు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, రాకపోకలకు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. చెరువులు, కుంటల వద్ద నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సి.ఐ రమణ మూర్తి మాట్లాడుతూ గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టిందని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి నిమజ్జన ప్రదేశాల వద్దకు రావద్దని సూచించారు. నిమజ్జన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్ చేతుల మీదుగా నగదు పురస్కారం అందుకోనున్న కిష్టాపూర్ విద్యార్థిని



**జన్నారం,సెప్టెంబర్20 (ప్రజాజ్యోతి)** గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న రేండ్లగూడ గ్రామానికి చెందిన విద్యార్థిని లశెట్టి శ్వేత తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా రెండు లక్షల నగదు పురస్కారం అందుకోనున్నట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు గుండ రాజన్న ఉపాధ్యాయులు దాముఖ కమలాకర్ తెలిపారు. శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ చేపట్టిన చదువుకో తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24వ తేదీ గురువారం రోజున హైదరాబాద్ సెంచరీ కన్వెన్షన్ సెంటర్లో జరగనున్న చదువుకో తెలంగాణ బహుమానం సమావేశంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా విద్యార్థిని లశెట్టి శ్వేత ఈ నగదు పురస్కారాన్ని అందుకొనున్నట్లు తెలిపారు. నగదు పురస్కారానికి ఎంపికైన విద్యార్థిని శ్వేతను జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా ఇన్చార్జి విద్యాశాఖ అధికారి పి చంద్రయ్య ఐఏఎస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, మండల విద్యాధికారి బి రాజేందర్, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, పాఠశాల ఏఏపిసి చైర్మన్ మంగ, పాఠశాల ఉపాధ్యాయులు జాడి మురళి,దాముక కమలాకర్, గోవర్ధన చారి, కొట్టే రాజన్న, బుచ్చిలింగయ్య, ప్రకాష్ బానవత్, నగేష్, మణెమ్మ,జ్యోతిశీల, అశోక్, నరహరి శర్మ, వావిలాల వాసు, కాంతయ్య, శ్రీనివాస్, రజిత రాణి, సుస్మిత, అజీమ్, స్వప్న,కృష్ణమూర్తి, రాజిరెడ్డి రాజేశ్వర్, ఆర్ శ్రీనివాస్, అనురాధ మరియు మండల ప్రజలు అభినందించారు.

## అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ వార్డు మెంబర్



**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల నియోజక వర్గం దండేపల్లి మండలం పెద్దపేట్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ 4వ వార్డు మెంబర్ బొడ్డు సత్యవతి--వెంకటేష్ దంపతులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆర్టీపీఆర్ఎస్ గద్దం త్రిమూర్తి, గ్రామ నాయకులు బండారి వెంకటేష్, మల్లేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడారి దేశం దుబాయిలో వెల్లివిరిసిన వినాయక భక్తి - ఘనంగా నిమజ్జనం



**జన్నారం,సెప్టెంబర్20(ప్రజాజ్యోతి)** పరాయి దేశం, ఎడారి దేశం అయినప్పటికీ దుబాయిలో హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షిస్తూ తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా వినాయకుడిని ప్రతిష్టించి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించామని,శనివారం సాయంత్రం గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయినా ఇప్పటికీ గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 16, 2024న హైదరాబాద్ లోని దక్కన్ హోటల్ లో గల్ఫ్ సంఘాల సమావేశంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు "గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డ్" ను ఏర్పాటు చేయాలని, గల్ఫ్ లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించేలా ముఖ్యమంత్రి మనసు మార్చాలని, గల్ఫ్ కార్మికులు, ప్రజలందరూ బాగుండాలని ఆ విఘ్నేశ్వరుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ నిమజ్జన వేడుకలలో టి జి డబ్ల్యు డబ్ల్యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీమ్,ధర్మాజీ సత్తన్న, జుంబర్తి గంగాధర్,కునారపు రమేష్,కరుణాకరణ్, మనోజ్, తిరుపతి, నరసయ్య, రాజన్న, సాయి నారాయణ, నవీన్ కుమార్, విజయ్, నరేష్, మణికంఠ, శ్రీనివాస్, సత్తన్న, నంబయ్య, రామన్న, శశి, రణధీర్, భినేష్, రాజేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీల్లో దళిత ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టకపోవడంపై మంచిర్యాల పట్టణంలో నిరసన



అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకుల ఆందోళన



**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ రెండు రోజుల క్రితం మంచిర్యాల పట్టణంలో పర్యటించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల ఫోటోలు పెట్టకపోవడాన్ని నిరసిస్తూ దళిత ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు ఆదివారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, కార్పొరేటర్ హరికృష్ణ మాట్లాడుతూ.. ఎంపీ వంశీకృష్ణ అధికారిక పర్యటన సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన దళిత సామాజిక వర్గ ప్రజాప్రతినిధుల ఫొటోలను ఫ్లెక్సీలలో ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎంపీ వంశీకృష్ణ గెలుపు కోసం తాము అహర్నిశలు కృషి చేశామని గుర్తు చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఎంపీ దళిత ప్రజాప్రతినిధులను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పట్టణ సుందరీకరణలో భాగంగా మున్సిపల్ అధికారులు తొలగించారని తెలిపారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది విషయంలో ఎవరైనా జోక్యం చేసుకుంటే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు. దళిత ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు డీఏలు ప్రకటించి, పీఆర్సీ అమలు చేయాలి

## : ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకటరావు డిమాండ్లు



**ఖానాపూర్ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి )**రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తోందని, వెంటనే డీఏలు ప్రకటించి నూతన పీఆర్సీని అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖానాపూర్‌లో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ధరల సూచీ ప్రకారం చెల్లించాల్సిన కరువు భత్యం (డీఏ) బకాయిలు ఏకంగా ఆరు పెండింగ్‌లో ఉండటం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో పీఆర్సీ నివేదికను తెప్పించుకోవడానికి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే పీఆర్సీ డీఏలను ప్రకటించాలని స్పష్టం చేశారు. వీటితో పాటు, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ముకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన రాజ్యాంగబద్ధ హక్కులను పరిష్కరించని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఏకమై పోరాటాలు, ధర్నాలు తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా రాజేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కోశాధికారి రవినాయక్ సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం నుంచి మాత్రమే విశ్రాంతి.. స్నేహానికి మాత్రం కాదు

## కాలం మారినా.. సింగరేణి స్నేహబంధం చెదరలేదు

## నాటి జ్ఞాపకాలతో మరోసారి ఒక్కటైన విశ్రాంత ఉద్యోగులు



**మంచిర్యాల, 20,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఒకే గనిలో పనిచేసిన రోజులు.. ఒకే సంస్థలో కలిసి చెమటోడ్చిన అనుభవాలు.. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచిన స్నేహబంధాలు.. ఉద్యోగ విరమణతో విధులకు దూరమైనా ఆ అనుబంధాలు మాత్రం దూరం కాలేదు. కాలం గడిచినా, వయసు పెరిగినా నాటి స్నేహితుల మధ్య ఆత్మీయత అలాగే కొనసాగుతోంది. దీనికి నిదర్శనంగా పాత మంచిర్యాలకు చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఆదివారం మరోసారి ఒకచోట చేరి నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి విశ్రాంత ఉద్యోగులుగా కొనసాగుతున్న పాత మంచిర్యాలకు చెందిన పలువురు మాజీ ఉద్యోగులు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, ఎన్నో ఏళ్ల క్రితం కలిసి పనిచేసిన రోజుల్ని గుర్తుచేసుకున్నారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలు, సహచరులతో కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ నెల 9న మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున నస్పూర్ "సింగరేణి గార్డెన్స్ " లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా విశ్రాంత ఉద్యోగులందరినీ ఘనంగా సన్మానించిన విషయం తెలిసిందే. ప్రతి విశ్రాంత ఉద్యోగికి శాలువా కప్పి సత్కరించడంతో పాటు, భార్యాభర్తల ఫొటోతో కూడిన మెమెంటోను అందజేసి ఆత్మీయంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో పాత మంచిర్యాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు కూడా పాల్గొని ఎంతో ఆనందించారు. అదే ఆత్మీయతను కొనసాగిస్తూ ఆదివారం పాత మంచిర్యాలలో మరోసారి సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు, ఆత్మీయ సమ్మేళనంలో అందుకున్న మెమెంటోలను తమతో తీసుకొచ్చారు. ఒక్కొక్కరిని పేరుపేరునా పిలిచి శాలువాలతో సత్కరించి, మెమెంటోలను అందిస్తూ మరోసారి ఆత్మీయంగా గౌరవించుకున్నారు. దీంతో కార్యక్రమ ప్రాంగణం అంతా ఆత్మీయ పలకరింపులు, నవ్వులు, నాటి జ్ఞాపకాలతో సందడిగా మారింది. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు తమ సింగరేణి ఉద్యోగ జీవితంలోని మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పట్లో కలిసి పనిచేసిన సహచరులు, విధుల్లో ఎదురైన అనుభవాలు, కష్టసుఖాల్లో ఒకరికొకరు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. ఎన్నో సంవత్సరాలు గడిచినా తమ మధ్య ఉన్న స్నేహబంధం ఏమాత్రం తగ్గలేదని, ఇలాంటి ఆత్మీయ సమావేశాలు తమకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. "ఉద్యోగం నుంచి మాత్రమే విశ్రాంతి.. స్నేహానికి మాత్రం కాదు" అన్నట్టుగా సాగిన ఈ ఆత్మీయ కలయిక అందరి హృదయాలను తాకింది. వయసును మరిచి నాటి సహచరులంతా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి గడపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెమెంటోల రూపంలో అందుకున్న గుర్తులను మరోసారి పరస్పరం సన్మానించుకోవడం ద్వారా తమ మధ్య ఉన్న అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు పానుగంటి పోచయ్యతో పాటు జిల్లా సంఘం ప్రతినిధులు, సన్మాన గ్రహీతలైన విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.



**జన్నారం,సెప్టెంబర్20(ప్రజాజ్యోతి)** జన్నారం మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో ఆదివారం రోజున ఇటీవల రాష్ట్ర,జిల్లా, మండల స్థాయి అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్ సి టి చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత శాలువా, మెమెంటో తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాద్ నేత మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పే ప్రతి మాట, చేసే ప్రతి పని విద్యార్థి జీవితంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థుల భవితకు, దేశ భవిష్యత్తుకు గురువే మార్గదర్శి అని కొనియాడారు. అటువంటి గురువులను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సన్మాన గ్రహీతలు మేజర్ ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలంగాణ యూనివర్సిటీ డాక్టర్ బోర్లకుంట రాజయ్య నేత,జిల్లా స్థాయి ఉత్తమ పాఠశాల చింతగూడ కు చెందిన కామెర శంకర్, ఉత్తమ ఉపాధ్యాయులు బాదావత్ ప్రకాష్ నాయక్ ,దుర్గం భూమన్న జాడి రాజలింగం లతో పాటు నేతకాని కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న, జిల్లా అధ్యక్షులు రామటంకి శ్రీనివాస్, మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకటయ్య ,నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్ సీనియర్ నాయకులు జనుగురి మల్లయ్య, దుర్గం నందయ్య అల్లూరి వినోద్ దుర్గం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 108 రకాల స్వీట్లు, 108 ప్రసాదాలతో గణనాథుడికి ఘన నైవేద్యం



**మంచిర్యాల, 20,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్ సృష్టి ఎంక్లేవ్ అపార్ట్‌మెంట్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ రకాల ముగ్గులతో ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. అనంతరం 108 రకాల స్వీట్లు, 108 రకాల ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యాలు సమర్పించి అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించి, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో పేరం రాజయ్య--జోత్స్న దంపతులు, న్యాయవాది అలేఖ్య నటేశ్వర్, ఎథిక్ అకాడమీ యాజమాన్యం, పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యం, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సతీష్‌రావు, చౌదరి, రాజగోపాల్‌తో పాటు మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సామూహికంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను కాలనీవాసులు అభినందించారు.

## లడ్డూను వేలంలో దక్కించుకున్న యువకుడు



**సోనాల, సెప్టెంబర్ 20 ( ప్రజాజ్యోతి ):**సోనాల కేంద్రంలోని వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలం పాట అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ ఏడాది గణనాథుని ప్రసాదమైన లడ్డూను దండారి రంజిత్ కుమార్ వేలంలో 12,100/- ధరకు పాడుకొని తన భక్తిని, ఉత్సాహాన్ని చాటుకున్నాడు. స్థానిక లక్ష్మీ నగర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వహించిన ఈ వేలం పాటలో పలువురు స్థానికులు, ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీ తీవ్రంగా నెలకొన్నప్పటికీ, చివరికి రంజిత్ కుమార్ లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా లడ్డూ పొందిన యువకుడు మాట్లాడుతూ.. "విఘ్ననాథుని లడ్డూ ప్రసాదం దక్కడంతో నా కల నెరవేరింది. ఈ ప్రసాదం ఇంట్లో ఉండటం వల్ల లక్ష్మీదేవి కటాక్షంతో పాటు సకల శుభాలు కలుగుతాయని నమ్ముతున్నాను. వచ్చే ఏడాది సమాజ సేవలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతాను" అని సంతోషం వ్యక్తం చేశాడు.

## ఆదివాసీ హక్కులు, ప్రత్యేక గుర్తింపును కాపాడుకోవాలి

**భూమి -అటవీ హక్కు విద్యా వైద్య ఉపాధిలో ప్రాధాన్యం కల్పించాలి**

**క్షేత్రబంధన్ స్ఫూర్తితో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ వెల్లడి**



**ఖానాపూర్ సెప్టెంబర్ 20( ప్రజా జ్యోతి)** గిరిజన ఆదివాసి బిడ్డలు తమ హక్కులను ప్రత్యేక గుర్తింపును కాపాడుకోవాలని క్షేత్రస్థాయిలో పోరాటానికి సిద్ధమవ్వాలని తెలంగాణ రాష్ట్ర నిర్మల్ జిల్లా నిర్మల్ జిల్లా ఖానాపూర్ శాసనసభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు ఆదివాసి బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్ జిల్లా కిన్వట్‌లోని ఎం.కె. గార్డెన్ మంగళ్ కార్యాలయంలో నిర్వహించిన ఆదివాసీ క్షేత్రబంధన్ ముక్తి దిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే, వెద్మ బొజ్జు పటేల్ అతిథిగా పాల్గొని సభను ఉద్దేశించి మాట్లాడారు. ఆదివాసీలకు ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, జీవన విధానం ఉన్నాయని, వారి ప్రత్యేక గుర్తింపు, హక్కులు, అస్తిత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆదివాసీల ప్రత్యేక మత, సాంస్కృతిక గుర్తింపుకు జనగణనలో తగిన ప్రాధాన్యత కల్పించాలని, జనగణనలో ఆదివాసీల ప్రత్యేక మత, సాంస్కృతిక గుర్తింపుకు ప్రత్యేక కోడ్ కల్పించాలనే డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని అన్నారు. అలాగే భూమి--అటవీ హక్కులు, విద్య, ఉపాధి వంటి అంశాల్లో ఆదివాసీలకు న్యాయం జరిగేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రబంధన్ నుంచి విముక్తి కోసం ఆదివాసీలు సాగించిన పోరాటం చరిత్రలో కీలక ఘట్టమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ప్రత్యేక గుర్తింపు, సంస్కృతి పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, మేధావులు, యువత ఐక్యంగా ముందుకు సాగాలని ఖానాపూర్ శాసనసభ్యులు పిలుపునిచ్చారు.

# మంచిర్యాల అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవ

**పెండింగ్ రోడ్డు పనులు, హెచ్ఎల్‌బీల నిర్మాణంపై కేంద్రం దృష్టికి సమస్యలు**

**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల ప్రజల భద్రత, మెరుగైన రవాణా సౌకర్యం, ప్రాంతాల మధ్య మెరుగైన కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ సభ్యులు శ్రీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు అభివృద్ధి పనులు, హై లెవల్ బ్రిడ్జిల (హెచ్ఎల్‌బీ) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. చెన్నూరు, చిర్రకుంట, రసూల్‌పల్లి రోడ్డు, ఆదిల్‌పేట్, వెంకటాపూర్, ముదిగుంట తదితర ప్రాంతాలకు సంబంధించిన హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణంతో పాటు రోడ్ల వైడెనింగ్, స్ట్రెంగ్తెనింగ్ పనులను పూర్తి చేయాల్సి ఉందని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. సుమారు 16 కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన ఈ అభివృద్ధి పనులకు దాదాపు రూ.40 కోట్ల అంచనా వ్యయం ఉంటుందన్నారు. ఈ పనుల కోసం గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఎంపీ తెలిపారు. ఇప్పటికే మంజూరైన పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు



.మంచిర్యాల జిల్లాకు అవసరమైన మౌలిక వసతులు, ప్రజల భద్రత, మెరుగైన రవాణా సౌకర్యం, ప్రాంతాల మధ్య కనెక్టివిటీ కోసం నిరంతరం కృషి చేస్తామని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. "ప్రజల హక్కు కోసం.. మంచిర్యాల అభివృద్ధి కోసం.. నిరంతర కృషి" అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# శ్రీరాంపూర్‌లో ఘనంగా సాంస్కృతిక పోటీలు

## కళాకారుల ప్రతిభకు వేదికగా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ పోటీలు





**మంచిర్యాల, 20,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి అంటే కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా కళలు, క్రీడలు, సాంస్కృతిక ప్రతిభను ప్రోత్సహించే సంస్థగా కూడా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ సాంస్కృతిక పోటీలను ఆదివారం నస్పూర్ కాలనీలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల్లో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడంతో ప్రాంగణం ఆద్యంతం కళా వైభవంతో సందడిగా మారింది. భజన్ కీర్తన, గజల్, లైట్ సాంగ్, కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి వంటి సోలో ఈవెంట్లతో పాటు ఫోక్ డాన్స్, ఆర్కెస్ట్రా, కవ్వాలి వంటి గ్రూప్ ఈవెంట్లు, గిటార్, వయోలిన్, మౌత్ ఆర్గాన్, డోలక్, కీబోర్డ్ తదితర ఇన్‌స్ట్రుమెంటల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులు తమ గాత్రం, వాయిద్య నైపుణ్యం, నృత్య ప్రతిభతో ప్రేక్షకులను అలరించి ఆకట్టుకున్నారు. ఈ పోటీలకు గోల్డ్ మెడలిస్ట్ ఫ్లూట్ రవి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. గ్రూప్ విభాగాల్లో ఫోక్ డాన్స్‌లో నీలాల శ్రీనివాసు బృందం, కవ్వాలి విభాగంలో ఎస్.కె. తాజా బృందం, ఆర్కెస్ట్రా విభాగంలో మేడ పెద్దయ్య బృందం విజేతలుగా నిలిచాయి. వ్యక్తిగత విభాగాల్లో జానపద గీతంలో శ్రీనివాస్, ఫ్లూట్ విభాగంలో రవి, కర్ణాటక సంగీతంలో ఎస్‌టీపీకి చెందిన శ్రీనిధి, గజల్ విభాగంలో తాజుద్దీన్ తదితర శ్రీరాంపూర్ కమ్యూనికేషన్ సెల్ కళాకారులు ప్రతిభ




కనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్ మాట్లాడుతూ.. రానున్న నవంబర్‌లో మణుగూరు ఏరియాలో జరగనున్న కంపెనీ స్థాయి సాంస్కృతిక పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా కళాకారులు సత్తా చాటి ఏరియాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం కళాకారులు మరింతగా సాధన చేసి కంపెనీ స్థాయిలోనే కాకుండా కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ప్రతిభను కనబరచాలని కోరారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారితో పాటు పాల్గొన్న ప్రతి కళాకారుడిని కమ్యూనికేషన్ సెల్ తరఫున అభినందించారు. కళలకు, కళాకారులకు సింగరేణి అందిస్తున్న ప్రోత్సాహం తమలో మరింత ఉత్సాహాన్ని నింపుతోందని పాల్గొన్న కళాకారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు .

# ప్రపంచ అల్జీమర్స్ డే -- జ్ఞాపకాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత

సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్

నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ అల్జీమర్స్ డే

**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ అల్జీమర్స్ దేను నిర్వహిస్తారు. అల్జీమర్స్ వ్యాధి, డిమెన్షియా గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం, బాధితులు మరియు వారి కుటుంబాలకు అండగా నిలవడం ఈ రోజు ప్రధాన ఉద్దేశమని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ అన్నారు. అల్జీమర్స్ వ్యాధి కేవలం మతిమరుపు మాత్రమే కాదని, ఇది మెదడు పనితీరును క్రమంగా ప్రభావితం చేసే వ్యాధి అని తెలిపారు. జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే శక్తి, మాట్లాడే సామర్థ్యం, రోజువారీ పనులను నిర్వహించే సామర్థ్యం క్రమంగా తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. అల్జీమర్స్ వ్యాధి డిమెన్షియాకు అత్యంత సాధారణ కారణాల్లో ఒకటిగా పరిగణించబడుతోందన్నారు. వృద్ధాప్యం అంటే తప్పనిసరి గా అల్జీమర్స్ వ్యాధి వస్తుందని భావించకూడదన్నారు. వయసు ప్రధాన ప్రమాద కారకమైనప్పటికీ మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, పొగతాగడం, అధిక మద్యపానం, సామాజిక ఒంటరితనం వంటి అంశాలు డిమెన్షియా ప్రమాదంతో సంబంధం కలిగి ఉంటాయని తెలిపారు. అందువల్ల చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ నడక లేదా ఇతర శారీరక వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడం, తగినంత నిద్రపోవడం, పొగతాగడం మానేయడం, సామాజికంగా చురుకుగా ఉండటం వంటి చర్యలు మెదడు ఆరోగ్యానికి కూడా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఇటీవల జరిగిన విషయాలను తరచుగా మర్చిపోవడం, ఒకే విషయాన్ని పదేపదే అడగడం, వస్తువులను ఎక్కడ పెట్టారో గుర్తుపట్టలేకపోవడం, పరిచయమైన ప్రదేశాల్లో దారి తప్పడం, సాధారణ పనులు చేయడంలో ఇబ్బంది పడటం, సరైన పదాలు గుర్తుకు రాకపోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో సమస్యలు ఎదురవడం వంటి మార్పులను కుటుంబ సభ్యులు గమనించాలని సూచించారు. అయితే ప్రతి మతిమరుపును అల్జీమర్స్‌గా భావించకూడదని, ఇతర వైద్య కారణాలు కూడా ఉండే అవకాశం ఉన్నందున వైద్య నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ముందస్తు నిర్ధారణ ఎంతో కీలకమని, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే బాధితులు, కుటుంబ సభ్యులు భవిష్యత్ సంరక్షణ, చికిత్స, ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ బాధ్యతలపై ముందుగానే ప్రణాళిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాయామం, మానసిక చురుకుదనం, సామాజిక కార్యకలాపాలు, పునరావాసం వంటి సహాయక చర్యలు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయని అన్నారు. అల్జీమర్స్ ప్రభావం బాధితుడిపైనే కాకుండా కుటుంబ సభ్యులపై కూడా ఉంటుందని వేణు మాధవ్ అన్నారు. ముఖ్యంగా నిరంతరం సంరక్షణ అందించే వారు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అలాంటి సమయంలో బాధితులపై చిరాకు చూపకుండా ఓర్పుతో, ప్రేమతో, గౌరవంతో వ్యవహరించాలని సూచించారు. సంరక్షకుల ఆరోగ్యం, విశ్రాంతి కూడా ముఖ్యమని కుటుంబ సభ్యులు గుర్తించాలన్నారు. అల్జీమర్స్ బాధితులను సమాజానికి దూరం చేయకుండా వారి సామర్థ్యానికి అనుగుణంగా కుటుంబ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేలా




ప్రోత్సహించాలని తెలిపారు. వృద్ధులకు సురక్షితమైన వాతావరణం, అవసరమైన వైద్య సేవలు, సామాజిక మద్దతు అందించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రపంచ అల్జీమర్స్ డే కేవలం ఒక అవగాహనా దినోత్సవంగా ముగియకూడదని, ప్రతి కుటుంబం తమ వృద్ధుల ఆరోగ్యాన్ని గమనిస్తూ మతిమరుపును సాధారణ వృద్ధాప్య లక్షణంగా నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే వైద్య సలహా తీసుకోవాలని, యువత వృద్ధుల పట్ల బాధ్యతాయుతమైన వైఖరిని పెంపొందించుకోవాలని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ కోరారు.

# తెలంగాణ విద్యను కాపాడు కుందాం

ప్రైవేట్ పాఠశాల ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి

అన్ని మండలాల్లో తగిన సంఖ్యలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ విద్యకు ఆదర్శ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 18 శాతం కేటాయింపును నిర్ధారించే చట్టం తేవాలి

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 20, (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలో మరింత ప్రియమవుతున్న విద్య పేదలకు అందకుండా పోతుందని, ప్రతీ పేదవాడి ధరికి చేరే విదంగా దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని మాజీ ఐఏఎస్ అధికారి అకునూరి మురళి పిలు పునిచ్చారు.తెలంగాణ రా ష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, ప్రతి మండలంలో కనీసం ఒక్క తెలంగాణా పబ్లిక్ స్కూల్ ప్రభుత్వం ఏర్పాటు చేయా లని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, దళిత్ బహుజన్ ఫ్రంట్, సోషల్ డె మొక్రటిక్ ఫోరం, మదర్స్ అసోసియేషన్ స హకారంతో తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృ త్వంలో తెలంగాణలోని పది జిల్లాలలో బస్సుయాత్ర చేపట్టారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాలోకి చేరిన బస్సు యాత్ర ఇచ్చోడ మండల పరిధిలోని జామిడి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అనంతరం గుడిహత్నూర్ మండలంలోని గర్కంపేట్ మల్యాపూర్ లలో బడి నిద్ర కార్యక్రమం చేపట్టి ఆదివారం జిల్లా కేంద్రంలో స్థానిక సుందరయ్య భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ సభ్యులు చంపాలాల్, పద్మజ షా,సృజన యాదవ్, నిఖిల్ విజయ్, ముప్పిరీ కు మార్, డాక్టర్ జగదీష్, రూబీనా ఎన్. జిల్లాలోని పలువురు




ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు, కవులు, రాజకీయ నాయకులు, విద్యార్థుల తండ్రులు పెద్ద ఎ త్తున హాజరయ్యారు.

# సింగరేణి కోల్‌బెల్ట్ భూముల దరఖాస్తులు 45 రోజుల్లో పరిష్కరించాలి

### తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ డి.ఎస్. ఆదేశాలు జారీ

### ముగ్గురు సభ్యులతో కమిటీ

**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలో భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ శాసనసభలో సెప్టెంబర్ 16న "రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏకు సంబంధించిన సమస్యలు"పై జరిగిన స్వల్పకాలిక చర్చ నేపథ్యంలో రెవెన్యూ (భూ పరిపాలన-1) శాఖ ఈ మేరకు మెమో జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 47936/ల్యాండ్ అడ్మిన్ .. (1)/2026, తేదీ 19-09-2026 ప్రకారం, జి.ఓ.ఎం.ఎస్. నంబర్ 76, రెవెన్యూ (అసైన్‌మెంట్-1) శాఖ, తేదీ 11-07-2019, అలాగే జి.ఓ.ఎం.ఎస్. నంబర్ 28, రెవెన్యూ (అసైన్‌మెంట్-1) శాఖ, తేదీ 17-03-2023 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 45 రోజుల వ్యవధిలో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల కలెక్టర్లకు వర్తిస్తాయని మెమోలో వివరించారు. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించే సమయంలో సంబంధిత న్యాయస్థానాల ఆదేశాలు ఏవైనా ఉంటే వాటికి లోబడి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అలాగే దరఖాస్తుల్లో ఏవైనా అవకతవకలు గుర్తిస్తే, ప్రస్తుత నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ముగ్గురు సభ్యులతో కమిటీ..........**

పెండింగ్ దరఖాస్తులన్నింటినీ సంబంధిత జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే అధికారుల కమిటీ పరిశీలించి పరిష్కరించనుంది. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నామినేట్ చేసే ప్రతినిధి సభ్యుడిగా, జిల్లా రిజిస్ట్రార్ మరో సభ్యుడిగా ఉంటారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ డి.ఎస్. ఆదేశాలు జారీ చేశారు. ఈ మెమో ప్రతులను తెలంగాణ భూ పరిపాలన ప్రధాన కమిషనర్, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపించారు. 45 రోజుల గడువుతో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో సింగరేణి కోల్‌బెల్ట్ పరిధిలో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భూ దరఖాస్తుల పరిష్కారంపై ఆయా జిల్లాల అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యాంశం ఏమిటంటే ఈ మెమో ప్రకారం 2019, 2023 ప్రభుత్వ ఉత్తర్వుల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత జిల్లా కమిటీ 45 రోజుల్లో పరిశీలించి నిర్ణయించాలి. న్యాయస్థానాల ఆదేశాలు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకోవాలి.

# భక్తీ పూర్వకంగా శ్రీ సిద్ధి వినాయక గణేశునికి ప్రత్యేక పూజలు

### ప్లాస్టిక్ రహిత వినాయక మండపాలకు 'ప్రకృతి మిత్ర' పిలుపు

### టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కాలనీ లో 6 వ రోజు అన్నదానం

**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా నస్పూర్ టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కాలనీ లోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ వినాయక నవరాత్రుల సందర్భంగా గణేశునికి ప్రత్యేక పూజలు కొనసుగుతున్నాయి. 6 వ రోజు కూడా అన్నదానం కార్ర్యమం నిర్వహించాగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదంగా స్వీకరించారు. అలాగే వినాయక నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 'ప్రకృతి మిత్ర' తెలంగాణ సభ్యులు పిలుపునిచ్చారు. నిత్య పూజలు, ప్రసాద వితరణలో ప్లాస్టిక్‌కు బదులుగా ప్రకృతిసిద్ధమైన వస్తువులను వినియోగించాలని కోరుతూ ఆదివారం నస్పూర్ కలెక్టరేట్ రోడ్డులోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండపం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకు దొప్పలు, అరికే ఆకు పల్లాలు, బట్ట, జనపనార, కాగితపు సంచులు, స్టీల్ పళ్లాలు, గ్లాసులు, విస్తర్లు తదితర పర్యావరణహిత వస్తువులను ప్రదర్శించారు. "పవిత్రమైన వినాయక మండపాల్లో ప్లాస్టిక్ వద్దు.. ప్రకృతి పదార్థాలే ముద్దు", "థర్మాకోల్ పళ్లాలు వద్దు.. ఆకు దొప్పలు ముద్దు", "వెదురు బుట్టలు, మట్టి పాత్రలు వినియోగిద్దాం.. సంపూర్ణ భక్తిని చాటుదాం" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతిమిత్ర తెలంగాణ వ్యవస్థాపకులు, ప్రభుత్వ వాల్టా అథారిటీ పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ పవిత్రమైన వినాయక మండపాల్లో ప్లాస్టిక్‌కు చోటు ఉండకూడదన్నారు. భక్తులకు ప్రసాద వితరణలో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా మార్కెట్‌లో లభించే ప్రకృతిసిద్ధమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. ప్రకృతిసిద్ధమైన పదార్థాలు సులభంగా ప్రకృతిలో కలిసిపోతాయని, పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని తెలిపారు. ప్రతి మండపంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పండుగల అసలు పరమార్థం ప్రకృతిని పరిరక్షించడమేనని పేర్కొన్న ఆయన, వినాయక మండపాలు కాలుష్య కేంద్రాలుగా మారకుండా ప్రతి భక్తుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జి) స్ఫూర్తితో ప్రతి పౌరుడు ప్రకృతి మిత్రగా మారాలని పిలుపునిచ్చారు. నిమజ్జనం సందర్భంగా సహజసిద్ధమైన పసుపు, కుంకుమ, పూలను మాత్రమే వినియోగించాలని, రసాయనాలతో కూడిన రంగులను ఉపయోగించి నదులు, చెరువులు, జలాశయాలను కలుషితం చేయవద్దని సూచించారు. టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కాలనీ శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి వినాయక నవరాత్రుల్లో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ప్రకృతిమిత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యావరణ అవగాహన కార్యక్రమాలు ప్రజలను మరింత చైతన్యవంతులను చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతిమిత్ర సభ్యులు, వినాయక మండలి సభ్యులు కస్తూరి నాగేశ్వర్, టి. సంపత్‌కుమార్, కె. రాజమౌళి, జి. వెంకటేశం, నాన్నయ్య, స్వర్ణలత, సునీత, నీరజ, కమల, పద్మాంజలితో పాటు కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



# స్లేట్ పాఠశాలలో ముగిసిన మోడల్ యునైటెడ్ నేషన్ 3.0

## విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లక్ష్యం



**జన్నారం,సెప్టెంబర్20 (ప్రజాజ్యోతి)** స్లేట్ హైస్కూల్ మరియు స్లేట్ సీబీఎస్ఈ పాఠశాలల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సెలెన్స్ పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్ కార్యక్రమం ఆదివారం తో ఘనంగా ముగిసింది. సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ సదస్సులో 20 పాఠశాలల నుంచి విద్యార్థి ప్రతినిధులు దేశాల అనుకరణలు, సంక్షోభ పరిస్థితులపై కార్యక్రమాలు, పార్లమెంటరీ చర్చల్లో పాల్గొన్నారు. మొదటి రోజు కార్యక్రమాన్ని ముఖ్య అతిథి నవోదయ విద్యాలయ సమితి, రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ ఎ. యుగంధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ప్రతినిధులుగా పలు జాతీయ, అంతర్జాతీయ విషయాలను అవగాహన చేసుకుని వాటిపై చర్చించారు. విద్యార్థి ప్రతినిధులు దౌత్య అనుకరణలు సంక్షోభ ప్రతిస్పందన కార్యక్రమాలు, పార్లమెంటరీ చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు ప్రధాన అంశాలను తీసుకున్నారు. లోక్ సభలో స్పీకర్ గా ఎ.సుప్రీత్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ గా ఎండి రయ్యాన్ వ్యవహరించారు. మొదటి రోజు వికసిత్ భారత్ పై చర్చ జరగగా ఈ చర్చల్లో నిర్మలా సీతారామన్, రాహుల్ గాంధీ, శశి థరూర్, నితిన్ గడ్కరీ, జైశంకర్ తదితర ఎంపీలను తలపించే విధంగా విద్యార్థులే ప్రతినిధులుగా వ్యవహరించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చైర్ గా రాగుల అవినాష్, కో-చైర్ గా సాయి హర్షితలు వ్యవహరించి డ్రోన్ యుద్ధం మరియు రక్షణ సాంకేతికతపై ఆస్ట్రేలియా,ఇరాన్, ఇజ్రాయెల్, భారత్, స్విట్జర్లాండ్,యూకే, ఫ్రాన్స్ దేశాల ప్రతినిధులు చర్చించారు రెండవ రోజు భారత్-పాకిస్తాన్ సరిహద్దు సంక్షోభ ప్రతిస్పందన కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు స్పైన్ భద్రత అంశంపై ఫ్రాన్స్ మరియు ఆస్ట్రేలియా ప్రతినిధుల మధ్య తీవ్ర వాదోపవాదం జరిగింది. యునెస్కోలో చైర్ గా మునజ్జా మరియం, కో-చైర్ గా టీ. సహస్రలు వ్యవహరించి వాతావరణ పరిరక్షణలో కృత్రిమ మేధస్సు వినియోగాన్ని పరిశీలించారు. రష్యా, స్వీడన్, డెన్మార్క్, స్పెయిన్, మెక్సికో, ఉత్తర కొరియా, జపాన్, అమెరికా ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ పాత్రలలో లీనమై కళ్ళకు కట్టినట్లుగా వారి వారి పాత్రల వ్యవహార శైలిని ప్రదర్శించారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులలో జాతీయ అంతర్జాతీయ అంశాలపై అవగాహన కల్పించినందుకు యజమాన్యానికి స్లేట్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ ప్రెస్ కమిటీ చైర్ సిజి ప్రశాంత్ డాక్యుమెంట్ చేసింది. ఈ కమిటీలో ఆర్. శర్మ,పి. ఎస్. సపుత,సాయి వెన్నెల, ఎస్.తోషిణి,ఎం.ప్రణవి సభ్యులుగా ఉన్నారు. ముగింపు కార్యక్రమంలో స్లేట్ గ్రూప్ చైర్మన్ డా. ఎ.శ్రీకాంత్ రెడ్డి, ఎం.జి. భాస్కర్ రెడ్డి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతినిధులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్లేవ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకుడు సుభాష్ రెడ్డి, స్లేట్ ఎక్సెలెన్స్ స్కూల్ ప్రిన్సిపల్ షిరీన్ ఖాన్ ,స్లేట్ హై స్కూల్ ప్రిన్సిపల్ ప్రియా శివ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని యూనియన్లను అధికారిక సమావేశాలకు ఆహ్వానించాలి

### సేఫ్టీ సమావేశాల్లో పారదర్శకత పాటించాలి.. కార్మిక సమస్యలను పరిష్కరించాలి

### సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి

**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి యాజమాన్యం నిర్వహించే మైన్ స్థాయి, ఏరియా స్థాయి, కంపెనీ స్థాయి అధికారిక సమావేశాలకు గుర్తింపు పొందిన, ప్రాతినిధ్య సంఘాలతో సంబంధం లేకుండా అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లేబర్ కమిషనర్ నిర్వహించిన ఎన్నికలకు నిర్దేశించిన రెండేళ్ల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో యాజమాన్యం ఇకపై అన్ని యూనియన్లను సమానంగా పరిగణించి అధికారిక సమావేశాలకు ఆహ్వానించాలని అన్నారు. కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ముఖ్యంగా డీజీఎంఎస్ అధికారులతో యాజమాన్యం నిర్వహించే సమావేశాలతో పాటు ఏరియా స్థాయిలో జరిగే బైపార్టీయేట్, ట్రైపార్టీయేట్ సమావేశాలకు అన్ని యూనియన్ల ప్రతినిధులను ఆహ్వానించాలని కోరారు. గుర్తింపు పొందిన లేదా ప్రాతినిధ్య సంఘాలకే పరిమితం కాకుండా ప్రతి కార్మిక సంఘానికి సమావేశాల్లో తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని యూనియన్లను సమావేశాలకు ఆహ్వానించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే అన్ని యూనియన్లు ఐక్యంగా సమావేశాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.




డీజీఎంఎస్ అధికారులతో నిర్వహించే సమావేశాల్లో సింగరేణి సంస్థలో జరిగిన ప్రమాదాలకు సంబంధించిన పూర్తి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. ప్రమాదాల నివేదికలు, ప్రమాదాలకు దారితీసిన కారణాలు, యంత్రాల సామర్థ్యం, పని ప్రదేశాల్లో భద్రతా పరిస్థితులు తదితర అంశాలను వాస్తవ రూపంలో అధికారులకు తెలియజేయాలని అన్నారు. ప్రమాదాలకు సంబంధించిన కీలక వివరాలను కప్పిపుచ్చ కుండా వాస్తవాలను వెల్లడించాలని సూచించారు. యాజమాన్యం తనకు అనుకూలంగా ఉన్న సంఘాన్ని దగ్గర పెట్టుకుని సేఫ్టీ బైపార్టీయేట్, ట్రైపార్టీయేట్ సమావేశాలు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు పూర్తిస్థాయిలో చర్చకు రావడం లేదని రాజారెడ్డి అన్నారు. పని ప్రదేశాల్లో అవసరమైన పనిముట్ల కొరత, రక్షణ పరికరాల కొరత వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నా యాజ మాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పని ప్రదేశాల్లో అవసరమైన రక్షణ పరికరాలు, పనిముట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ సింగరేణి సంస్థ లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం సరికాదని అన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితి, లాభాల వివరాలను కార్మికులకు తెలియజేస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని, వెంటనే సంస్థ లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మరోవైపు కార్మికుల సీఎంపీఎఫ్ ఖాతాలకు సంబంధించిన వివరాలను సకాలంలో అప్‌డేట్ చేయకపోవడం వల్ల కార్మికులు తమ సీఎంపీఎఫ్ వివరాల విషయంలో గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడికి సీఎంపీఎఫ్ ఖాతా వివరాలను సక్రమంగా అప్‌డేట్ చేసి, వారికి తమ ఖాతాలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్మికుల భద్రత, సంక్షేమం, సీఎంపీఎఫ్, సంస్థ ఆర్థిక పరిస్థితి తదితర అంశాల్లో యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. అన్ని యూనియన్లతో సమన్వయంతో వ్యవహరిస్తూ కార్మికుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్ రామగిరి రామస్వామి, కస్తూరి చంద్రశేఖర్, తోడే సుధాకర్, బోడకుంట శంకర్, వెంకటి రెడ్డి, మెల్లం శ్రీధర్, మీడివెళ్లి శ్రీనివాస్, సాయిళ్ల శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, వెంగల శ్రీనివాస్, సమ్మయ్య, అనిల్, భానేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల హక్కుల కోసం ముందుంటా..

## ...యాదవుల సామాజిక, రాజకీయ, ఆర్థిక ఎదుగుదలే లక్ష్యం ...యాదవులంతా ఐక్యంగా సంఘటితం కావాలి.

## .. జిల్లాలోని 18 మండలాల్లో పటిష్టమైన కమిటీలు ఏర్పాటు చేస్తాం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్

**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి:** యాదవుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లవేళలా ముందుండి పనిచేస్తానని అఖిల భారత యాదవ మహాసభ నాయకుడు బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. యాదవుల సామాజిక, రాజకీయ, ఆర్థిక ఎదుగుదలే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో తమ హక్కులు సాధించుకోవాలంటే యాదవులు సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.మందమర్రి పట్టణంలోని ఇందు గార్డెన్‌లో ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమ్మేళనానికి బండి సదానందం యాదవ్ హాజరై మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాదవ మహాసభ నాయకులు, ప్రతినిధులు, కులబాంధవులతో సమావేశమై సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. హక్కుల సాధన కోసం ఐక్యత అవసరం యాదవుల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని బండి సదానందం యాదవ్ సూచించారు. కులబాంధవుల సమస్యలు, అవసరాలు, హక్కుల సాధన కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, యాదవులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న యాదవ కుటుంబాల నుంచి జిల్లా స్థాయిలో ఉన్న నాయకుల వరకు అందరినీ సంఘటితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేలా ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత సంఘ నాయకులపై ఉందని పేర్కొన్నారు.

**..18 మండలాల్లో పటిష్టమైన కమిటీలు**

మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లో యాదవ మహాసభకు పటిష్టమైన కమిటీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బండి సదానందం యాదవ్ తెలిపారు. ప్రతి మండలంలో సంఘాన్ని బలోపేతం చేసి, గ్రామస్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.సంఘ నిర్మాణం బలంగా ఉంటేనే యాదవుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లగలమన్నారు. ప్రతి మండలంలో నాయకత్వాన్ని తయారు చేసి, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఒక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక ఎదుగుదలపై దృష్టి యాదవ సమాజం కేవలం ఒక రంగానికే పరిమితం కాకుండా విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయాలు, ఆర్థిక రంగం తదితర అన్ని రంగాల్లో ముందుకు సాగాలని బండి సదానందం యాదవ్ ఆకాంక్షించారు. యువతకు సరైన మార్గదర్శకత్వం అందించి ఉన్నత విద్య, ఉపాధి



అవకాశాల వైపు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందేలా సంఘం తరఫున అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని అన్నారు.

**రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి**

ప్రస్తుత ప్రభుత్వంలో యాదవులకు తగిన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని బండి సదానందం యాదవ్ అన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థలు, వివిధ ప్రభుత్వ కమిటీలు, నామినేటెడ్ పదవులు తదితర అవకాశాల్లో యాదవులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదగడానికి యువతను ప్రోత్సహించడంతో పాటు సమాజ సమస్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సహకారం అవసరం యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని బండి సదానందం యాదవ్ కోరారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యాదవుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.చిన్న వ్యాపారాలు నిర్వహించే వారు, పశుపోషణపై ఆధారపడే కుటుంబాలు, ఆర్థికంగా వెనుకబడిన వారు అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు విద్యా అవకాశాలను విస్తరించాలని సూచించారు. యాదవులంతా ఏకం కావాలి యాదవులంతా ఒకే తాటిపైకి వచ్చి సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని బండి సదానందం యాదవ్ పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలు, రాజకీయ భేదాలకు అతీతంగా కులబాంధవుల ప్రయోజనాల కోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు.సంఘంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని, నాయకులు మాత్రమే కాకుండా సాధారణ



కులబాంధవులు కూడా సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారంతో ముందుకు సాగితే యాదవ సమాజాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు.

**...గ్రామం నుంచే మార్పు మొదలు కావాలి**

యాదవ సమాజ అభివృద్ధి గ్రామస్థాయి నుంచే ప్రారంభం కావాలని బండి సదానందం యాదవ్ అన్నారు. ప్రతి గ్రామంలో యాదవ కుటుంబాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంఘం పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి కమిటీలు తమ ప్రాంతంలోని సమస్యలను మండల కమిటీల దృష్టికి తీసుకురావాలని, మండల కమిటీలు జిల్లా నాయకత్వంతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.సమాజంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని కోరారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి భవిష్యత్ తరాలకు బలమైన మార్గాన్ని చూపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**..సంఘ నిర్మాణమే ప్రధాన లక్ష్యం**

అఖిల భారత యాదవ మహాసభను జిల్లాలో మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. 18 మండలాల్లో కమిటీల ఏర్పాటు, గ్రామస్థాయి నాయకత్వ నిర్మాణం, కులబాంధవుల సమస్యలపై నిరంతర పోరాటం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. యాదవుల అభివృద్ధి కోసం తన శక్తి మేరకు పనిచేస్తానని, కులబాంధవులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. యాదవుల హక్కుల కోసం అవసరమైన సందర్భంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కూడా వెనుకాడబోమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న నాయకులు, ప్రతినిధులు జిల్లాలో యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాబోయే రోజుల్లో మండల, గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలు గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి పూర్వ విద్యార్థుల సన్మానం

**ఖానాపూర్ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి )**సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2010-11 పదవ తరగతి పూర్వ విద్యార్థులు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్మల్ ప్రభుత్వ బాలికల పాఠశాల ఉర్దూ మీడియం కి చెందిన ఉపాధ్యాయుడు గౌస్ మొహియుద్దీన్ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్మల్ లో వారి నివాసంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా రంగంలో దీర్ఘకాలంగా విశేష సేవలు అందించిన ఉపాధ్యాయుడు జిల్లా స్థాయి పురస్కారాన్ని అందుకోవడం తమకు మాత్రమే కాకుండా యావత్ విద్యా సమాజానికి గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో పర్వేజ్, సల్మాన్ ఖాన్, అతీక్, అబిద్, ఇజాజ్, మిన్హాజ్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# జేబీసీసీఐ-12 ప్రతిష్ఠంభన పై "ప్రజజ్యోతి" లో ప్రత్యేక కథనం.........!!!

**జేబీసీసీఐ-12 ప్రతిష్టంభన ఎప్పుడు తొలగిపోతుంది?**

**17 రోజుల హామీ తర్వాత కూడా కోల్ ఇండియా మౌనం**

**ఎన్‌సీడబ్ల్యూఏ గడువు ముగిసి మూడు నెలలు**

**బొగ్గు గనుల కొత్త వేతన చర్చలకు ఎదురుచూపులు**

**మంచిర్యాల, 20, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్‌లో 12వ జాయింట్ బైపార్టైట్ కమిటీ ఆఫ్ ది కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ) ఏర్పాటు ఎప్పుడు జరుగుతుందన్న ప్రశ్నకు ఇంకా స్పష్టత రాలేదు. సెప్టెంబర్ 3న జరిగిన కోల్ ఇండియా అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో జేబీసీసీఐ ఏర్పాటుకు అనుమతి కోరుతూ బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ పంపుతామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఆ హామీ ఇచ్చి సెప్టెంబర్ 20 నాటికి 17 రోజులు గడిచినా కమిటీ ఏర్పాటుపై స్పష్టమైన అధికారిక ప్రకటన వెలువడకపోవడం కార్మిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జేబీసీసీఐ ఏర్పాటుపై ఆశలు చిగురించిన నేపథ్యంలో సెప్టెంబర్ 12న రాంచీలో నిర్వహించాల్సిన సంయుక్త సమావేశాన్ని కార్మిక సంఘాలు వాయిదా వేసుకున్నాయి. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు తదుపరి చర్యలు జరుగుతాయని భావించినప్పటికీ, ఇప్పటివరకు పరిస్థితిలో గణనీయమైన మార్పు కనిపించకపోవడంతో తదుపరి కార్యాచరణపై యూనియన్లు దృష్టి సారిస్తున్నాయి.

**సెప్టెంబర్ 3 సమావేశంపై పెరుగుతున్న ఆశలు....**

కోల్ ఇండియా అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం సెప్టెంబర్ 3న జరిగింది. జేబీసీసీఐ ఏర్పాటుపై కార్మిక సంఘాలు తమ అభిప్రాయాలను, డిమాండ్లను యాజమాన్యం ముందుంచాయి. కొత్త కమిటీ ఏర్పాటు కాకుండా వేతనాలు, అలవెన్సులు, సేవా నిబంధనలు, పారిశ్రామిక సమస్యలపై తదుపరి ద్వైపాక్షిక చర్చలకు మార్గం ఏర్పడదని యూనియన్లు స్పష్టం చేశాయి. దీనిపై స్పందించిన కోల్ ఇండియా యాజమాన్యం జేబీసీసీఐ ఏర్పాటుకు అనుమతి కోరుతూ బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ పంపుతామని హామీ ఇచ్చింది ఈ హామీతో వెంటనే ఆందోళనను తీవ్రతరం చేయకుండా కార్మిక సంఘాలు తదుపరి పరిణామాలను పరిశీలించాలని నిర్ణయించుకున్నాయి.

**17 రోజులైనా.. అధికారిక ప్రకటన ఏదీ.....?**

సెప్టెంబర్ 3న ఇచ్చిన హామీకి సెప్టెంబర్ 20 నాటికి 17 రోజులు పూర్తయ్యాయి. అయితే జేబీసీసీఐ ఏర్పాటుకు సంబంధించి కోల్ ఇండియా నుంచి గానీ, బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి గానీ తుది నిర్ణయాన్ని వెల్లడించే అధికారిక ప్రకటన వెలువడకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది.యాజమాన్యం మంత్రిత్వ శాఖకు లేఖ పంపిందా? పంపితే దానిపై మంత్రిత్వ శాఖ స్పందన ఏమిటి? కమిటీ ఏర్పాటుకు




ఆమోదం ఎప్పుడు లభిస్తుంది? జేబీసీసీఐ తొలి సమావేశం ఎప్పుడు జరుగుతుంది? అనే ప్రశ్నలకు ప్రస్తుతం స్పష్టమైన సమాధానాలు లేవు.

**జూన్ 30తో ముగిసిన ఎన్‌సీడబ్ల్యూఏ..........**

జాతీయ బొగ్గు వేతన ఒప్పందం-11 కాలపరిమితి 2021 జూలై 1 నుంచి 2026 జూన్ 30 వరకు కొనసాగింది. జూన్ 30తో ఎన్‌సీడబ్ల్యూఏ గడువు ముగియడంతో తదుపరి వేతన ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. గత వేతన ఒప్పందాల మాదిరిగానే కొత్త వేతన చర్చలకు జేబీసీసీఐ కీలక వేదికగా ఉంటుంది. కోల్ ఇండియా పరిధిలోని నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులు, సేవా నిబంధనలు, ఇతర పారిశ్రామిక సమస్యలపై యాజమాన్యం--కార్మిక సంఘాల మధ్య చర్చలకు ఈ కమిటీ ప్రధాన వేదికగా నిలుస్తుంది.

**2021లోనే జేబీసీసీఐ-కి ఆమోదం..........**

జేబీసీసీఐ-ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ కొత్తగా ప్రారంభమైనది కాదు. 2021 మే 6న బొగ్గు మంత్రిత్వ శాఖ 12వ జేబీసీసీఐ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. అనంతరం 11వ జాతీయ బొగ్గు వేతన ఒప్పందానికి సంబంధించిన వేతన చర్చలు జేబీసీసీఐ ద్వారా కొనసాగాయి. ఇప్పుడు ఎన్‌సీడబ్ల్యూఏ కాలపరిమితి ముగియడంతో తదుపరి వేతన ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం జేబీసీసీఐ ఏర్పాటుపై కార్మిక వర్గాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి.

**ఈ చర్చలు వేతనాలకే పరిమితం కాదు............**

జేబీసీసీఐ ఏర్పాటు కేవలం వేతన చర్చలకే పరిమితమైన అంశం కాదు. బొగ్గు పరిశ్రమలో పారిశ్రామిక సంబంధాలు, ఉద్యోగుల సేవా నిబంధనలు, అలవెన్సులు, ఇతర కార్మిక సమస్యలకు కూడా ఈ కమిటీ కీలకంగా ఉంటుంది. అదే సమయంలో ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్-2020 నిబంధనల అమలు, వాటి ప్రభావం, కార్మిక సంఘాల ప్రాతినిధ్యం, యాజమాన్యం--కార్మిక సంఘాల మధ్య చర్చల విధానం వంటి అంశాలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 3న జరిగిన అపెక్స్ జేసీసీ సమావేశంలో ఈ అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

**తెలంగాణ లోని సింగరేణి ఉద్యోగులపైనా ప్రభావం..........**




జాతీయ బొగ్గు వేతన ఒప్పందం పరిధిలోకి వచ్చే కోల్ ఇండియా అనుబంధ సంస్థలతో పాటు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లోని నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు కూడా జేబీసీసీఐ ఏర్పాటు కీలకమైన అంశంగా మారింది. కొత్త కమిటీ ఏర్పడితేనే తదుపరి వేతన ఒప్పందానికి సంబంధించిన చర్చలు అధికారికంగా ముందుకు సాగే అవకాశం ఉంటుంది. దీంతో సింగరేణి ఉద్యోగులు, కార్మిక సంఘాలు కూడా జేబీసీసీఐ ఏర్పాటుపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

**వాయిదా పడిన రాంచీ సమావేశం...........**

సెప్టెంబర్ 12న రాంచీలో జరగాల్సిన సంయుక్త సమావేశాన్ని సెప్టెంబర్ 3న యాజమాన్యం ఇచ్చిన హామీ నేపథ్యంలో కార్మిక సంఘాలు వాయిదా వేసుకున్నాయి. యాజమాన్యం నుంచి తదుపరి చర్యలు వస్తాయని ఆశించినప్పటికీ, సెప్టెంబర్ 20 వరకు స్పష్టమైన అధికారిక ప్రకటన లేకపోవడంతో ఇప్పుడు తదుపరి అడుగు ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది.

**హామీ అమలుపై ఎదురుచూపులు..........**

సెప్టెంబర్ 3న ఇచ్చిన హామీకి 17 రోజులు పూర్తయ్యాయి. అయినప్పటికీ జేబీసీసీఐ ఏర్పాటుపై స్పష్టత లేకపోవడంతో కార్మిక సంఘాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే అధికారిక ఉత్తర్వులు వెలువడే వరకు కమిటీ ఏర్పాటు పూర్తయిందని చెప్పే పరిస్థితి లేదు. కోల్ ఇండియా యాజమాన్యం ఇచ్చిన హామీ ఎప్పుడు కార్యరూపం దాల్చుతుంది? బొగ్గు మంత్రిత్వ శాఖ అనుమతి ఎప్పుడు వస్తుంది? జేబీసీసీఐ అధికారికంగా ఎప్పుడు ఏర్పడుతుంది? తొలి సమావేశం ఎప్పుడు జరుగుతుంది? అన్న ప్రశ్నలకు సమాధానాల కోసం కోల్ ఇండియా, బొగ్గు మంత్రిత్వ శాఖ తదుపరి ప్రకటన కోసం ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఎదురుచూస్తున్నాయి. ఎన్‌సీడబ్ల్యూఏ గడువు ముగిసి మూడు నెలలు దాటుతున్న నేపథ్యంలో, కొత్త వేతన చర్చలకు సంబంధించిన ప్రక్రియ ఆలస్యం కాకుండా జేబీసీసీఐ ఏర్పాటుపై త్వరితగతిన స్పష్టత రావాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

---

# జపాన్ పర్యటన ముగించుకుని వచ్చిన హెచ్‌ఎం జాడి శ్రీనివాస్‌కు ఘన సన్మానం

**ఆదివారం సైతం ప్రత్యేక తరగతులు**

**నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ప్రశంసలు..**

**హాజరైన ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు**

**ఖానాపూర్ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ హై స్కూల్ కు చెందిన ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ విదేశాల్లోని విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లి విజయవంతంగా తిరిగి వచ్చిన సందర్భంగా మస్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్‌ను ఆదివారం పాఠశాల ఆవరణలో ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకటరావు, జిల్లా అధ్యక్షులు భూక్య రాజేష్ నాయక్ మాట్లాడుతూ, జపాన్‌లోని అత్యున్నత విద్యా ప్రమాణాలు, ఆధునిక బోధనా పద్ధతులను పరిశీలించి వచ్చిన అనుభవాలను మన తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అమలుపరిచి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పేరుపొందిన మస్కాపూర్ పాఠశాల పనితీరు ఆదర్శమని కొనియాడారు. అంతేకాకుండా, ఆదివారం సెలవు రోజైనప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, తల్లిదండ్రుల అనుమతితో పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటి నుండే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి




కుమార్, కోశాధికారి రవినాయక్, ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య, రాపర్తి కిషన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండలి వద్ద చిన్నారుల ఆటలతో సందడి



**బోథ్, సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి)**బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో శ్రీరామ్ సేన గణేష్ మండలి ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. కుర్చీల ఆటతో పాటు పలు వినోద కార్యక్రమాలు నిర్వహించడంతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. చిన్నారుల ఆటలను వీక్షించేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వారిని ప్రోత్సహించారు. ఆటల్లో విజేతలైన చిన్నారులకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు, తినుబండారాలు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీరామ్ సేన గణేష్ మండలి సభ్యులు మాట్లాడుతూ, చిన్నారుల్లో ఆనందాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు నవ్వ పవన్, సభ్యులు అభినయ్, సిద్ధూ, అచ్యుత్, అభిరామ్, అజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## యాదవులంతా ఏకమై ముందుకు సాగాలి.

**త్వరలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో భారీ సభకు సన్నాహాలు.**



**మందమర్రి, సెప్టెంబర్ 20(ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలోని యాదవులంతా ఐక్యంగా ఉంటూ సామాజికంగా, ఆర్థికంగా, విద్యా రంగాల్లో ముందుకు సాగాలని అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం పిలుపునిచ్చారు. ఆదివారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఇందు గార్డెన్స్‌లో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లాలోని 18 మండలాల నుంచి యాదవ సంఘాల ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాదవుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, కులంలో ఎవరికైనా సమస్య ఎదురైతే అందరూ కలిసి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. యాదవ సమాజాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.బండి సదానందం మాట్లాడుతూ యాదవ సమాజం చరిత్రలో నీతి, నిజాయితీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. శ్రీకృష్ణుడి వారసులుగా యాదవుల సామాజిక ఐక్యతను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మంచిర్యాల జిల్లాలోని గ్రామాల్లో గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.రానున్న రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యాదవులను ఏకతాటిపైకి తీసుకువచ్చి మంచిర్యాల జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ సహకారంతో యాదవ సంఘ భవనాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందేలా వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు.యాదవ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి ఐక్యతను చాటాలని బండి సదానందం కోరారు.

## సాకెర గ్రామంలో ఎడ్ల దొంగతనం



**సోనాల, సెప్టెంబర్ 20 ( ప్రజాజ్యోతి):**సోనాల మండల పరిధిలోని సాకేర గ్రామంలో జరిగిన పశువుల దొంగతనంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో గడిచిన రాత్రి ధరావత్ సంతోష్ రైతుకు చెందిన ఎడ్ల జతను అపరిచిత వ్యక్తులు దొంగిలించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీలాగే సాయంత్రం వేళ ఎడ్లను ఇంటి ముందున్న కొట్టంలో కట్టేసి నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి ఎడ్లు కనిపించక పోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో దొంగతనానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగిలించబడిన ఎడ్ల జత విలువ సుమారు లక్ష రూపాయిల పైనే ఉంటుందని బాధితుడు వాపోయాడు.

## మున్నూరు కాపులు సంఘటితం కావాలి:

**-రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్**

**బోథ్, సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి)**మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలో మున్నూరు కాపుల ఆత్మీయ సభ ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొండ దేవయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభాను తక్కువగా చూపించే ప్రయత్నాలు సరికావని అసహనం వ్యక్తం చేశారు. సమాజంలో మున్నూరు కాపుల వాస్తవ సంఖ్యను లెక్కించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించామని, దీని ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టి మన సంఖ్యాబలాన్ని చాటుతామని స్పష్టం చేశారు. అలాగే కోకాపేటలో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనాన్ని తప్పకుండా నిర్మించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొండ దేవయ్య పటేల్‌ను బోథ్ మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు మల్లెపూల శివారెడ్డి, ఆదిలాబాద్ తాలూకా మాజీ అధ్యక్షుడు కాళ్ల విఠల్, కొండ గంగాధర్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు, సమాజ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పి ఆర్ టి యు కార్యవర్గం ఎన్నిక



**బోథ్, సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి)**బోథ్ మండల పి ఆర్ టి యు ఎన్నికల్లో ఏకగ్రీవంగా మరొక్కసారి అధ్యక్షులుగా ఆర్టీవీ ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా సంగు స్వామి ఎన్నికయ్యా.ఈ మండల ఎన్నికల్లో జిల్లా నాయకులు బోథ్ మండల ఎంఈఓ మహమూద్ హుస్సేన్ సమక్షంలో నూతన మండల బాధ్యులుగా ఆర్టీవీ ప్రసాద్, సంగు స్వామి, అసోసియేట్ అధ్యక్షులుగా ముంతాజ్ ఖాన్, పి. రజిత ఉపాధ్యక్షులుగా శుభగున్, రవిరాజ్ కార్యదర్శులుగా సంధ్యారాణి, షర్ఫొద్దీన్, రంజిత్, నవత, హేమలత, సంగీత ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## లడ్డూ వేలంలో రూ.11,116.. శ్రీనివాస్ దంపతులకు సొంతం.

**సీఐఎస్ఎఫ్ కాలనీలో తొలిసారిగా లడ్డూ వేలం.**



**మందమర్రి, సెప్టెంబర్ 20( ప్రజాజ్యోతి ):** సింగరేణి సీఐఎస్ఎఫ్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి. శ్రీ వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.అన్నదానం అనంతరం తొలిసారిగా శ్రీ లక్ష్మీ గణపతి లడ్డూ వేలం నిర్వహించారు. రూ.1,116 ప్రారంభ ధరతో ప్రారంభమైన వేలంలో పలువురు భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, చివరకు తులసి శ్రీనివాస్--లక్ష్మి దంపతులు రూ. 11,116కు లడ్డూను దక్కించుకున్నారు.కాలనీలో మొదటిసారి లడ్డూ వేలం నిర్వహించడంతో భక్తుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. గణపతి స్వామి అనుగ్రహంతో ప్రసాదం తమకు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీనివాస్ దంపతులు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ తల్లి భాగ్యలక్ష్మి, భార్య తులసి లక్ష్మి, కుమార్తె తులసి హీరేన్ శ్రీ, కుమారుడు తులసి నిత్విన్ పాల్గొని గణపతి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఇంట్లోకి ప్రవేశించిన ఉడుముని బేస్ క్యాంప్ వాచర్ జాకీర్ సహాయంతో రక్షించి అడవిలో వదిలిన ఫారెస్ట్ బీట్ అధికారి రవీనా

**ఇండ్లలో ప్రవేశించే అడవి జంతువులను చంపడం చట్టరీత్యా నేరం:**

**వన్యప్రాణులు గ్రామాల్లో ప్రవేశించినట్లయితే వెంటనే సమాచారం ఇవ్వాలి. సిర్పూర్ (టి) ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్:**

**సెప్టెంబర్20,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి, కబీర్ అహ్మద్:**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రంలో శనివారం ఉడుము దారి తప్పి ఓ ఇంట్లోకి ప్రవేశించడంతో మాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి రవీనా బేస్ క్యాంప్ వాచర్ జాకీర్ తో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు.కీటకాలను వేటాడి తినే ఉడుము దారితప్పి ఓ ఇంట్లో ప్రవేశించడంతో దానిని బేస్ క్యాంప్ వాచర్ జాకీర్ సహాయంతో బీట్ అధికారిని రవీనా దానిని సురక్షితంగా పట్టుకొని రక్షించారు సమీప అటవీప్రాంతం లో విడిచిపెట్టారు. దారితప్పి గ్రామంలోకి లేదా ఇళ్లల్లోకి ప్రవే శించే అడవి జంతువులను చంపడం చట్ట రీత్యా నేరమని, వన్య ప్రాణులు గ్రామంలోకి ప్రవేశించినట్లయితే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు. ఉడుమును రక్షించిన బీట్ ఆఫీసర్ రవీనా, వాచర్ జాకీర్ లను ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ అభినందించారు.

## ఆదిలాబాద్ జిల్లాలో రైతు లపై పిడుగు పోటు

**ఓ మహిళా రైతు మృతి**

**రెండు ఎద్దులు ఒక ఆవు ఆరు గేదెలు మృతి**





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 20, (ప్రజా జ్యోతి)** ఈ ఏడాది రైతులు లెనినో ప్రభావం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మరో బాంబు లాంటి పిడుగు పోటుతో రైతులు మరింత నష్టం వాటిల్లింది. వర్షా భావ పరిస్థితుల వల్ల రైతులు అంతో కొంత కురిసిన వర్షాలకు తమ పంటలను కాపాడు కుంటూ వస్తున్నారు. వరి పంట పై ఈ లేనినో ప్రభావం తీవ్ర ప్రభావాన్ని చూపింది. వందలాది ఎకరాలు బీడు భూములుగా మారాయి. వర్షం నీరు తక్కువగా ఉప యోగపడే పంటలు సాగు చేసుకుంటూ రైతులు కాలం వెల్లదిస్తున్నారు. ముఖ్యంగా పత్తి, సోయా, కందులు పలు చిరుధాన్యాల పంటలను సాగు చేసి ఆర్థిక ఇబ్బందులను తొలగించుకు నేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది లెనినో ప్రభావం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా రైతులపై ప్రకృతి మరో రకంగా ఎర్ర కన్ను చేస్తోంది. ఆదివారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు వర్షాలు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయి. అదిలాబాద్ జిల్లా బేల మం డలంలో ఓ మహిళా రైతు పిడుగుపాటుకు వ్యవసాయం పనులు చేస్తుండగా అక్కడే మృతి చెందింది. ఆదిలాబాద్ రూరల్ మండల లోని లోహార్ గ్రామానికి చెందిన గైక్వాడ్ సునీల్ రైతుకు చెందిన రెండు ఎద్దులు, ఒక ఆవు ఈ పిడుగు పాటుకు వ్యవసాయ క్షేత్రంలోనే మర ణించాయి. నిర్మల్ రూరల్ మండలం లోని కొట్ల (కె) గ్రామంలో పిడుగు పాటుకు ఆరు గేదెలు మరణించాయి. రైతులు ఈ ఏడు లెనోనో ప్ర భావం వల్ల అంతో ఇంతో పంటలను సాగు చేసు కుంటూ కాలం వెల్లదీస్తున్న తరుణంలో పిడుగు పోటు రూపంలో మరిన్ని ఆస్తుల నష్టం వాటిల్లడం వల్ల ప్రకృతి తమపై ఏడాది తీవ్రంగా ఎర్ర కన్ను చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**పిడుగుపాటుకు మహిళ మృతి**

అదిలాబాద్ జిల్లా బేల మండలంలోని ఓ మారు మూల గ్రామంలో వ్యవసాయ పనులు సాగు చేసు కుంటున్న ఓ మహిళ రైతు పిడుగు పా టుకు బలైంది. బేల మండలం అవల్పూర్ గ్రామ సమీ పంలో ఉన్న పత్తి చేనులో కలుపు మొక్కలు తొలగిస్తు న్న తరుణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి పిడుగు పడి సోడెం లత (40) అనే మహిళా రైతు అక్కడి కక్క డే మృతి చెందింది. ఈ మ హిళా రైతు మృతి పట్ల గ్రా మంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లతకు భర్త, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## భారీ వర్షానికి రహదారిపై కూలిన చెట్టు

**రాకపోకలకు తీవ్ర అంతరాయం..**

**పట్టించుకోని అధికారులు**

**బాసర, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చెట్టు రహదారిపై కూలి పోయింది. వివేకానంద చౌక్ నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న చెట్టు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడింది. వర్షం పడుతున్న సమయంలో అటువైపు వాహనాలు రాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు కూలి రోడ్డుపై పడిన ప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపో వడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై కూలిన చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

## ఖానాపూర్ లో శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలి డి.ఎస్.పి శ్రీనివాస్ వెల్లడి



**ఖానాపూర్ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలో గల వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని నిర్మల్ డిఎస్పి శ్రీనివాస్ అన్నారు శనివారం రాత్రి డీఎస్పీ శ్రీనివాస్ పట్టణంలోని గణపతి మండపాలను సందర్శించి శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సిఐ సత్యనారాయణ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తో పాటుహిందూ ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మంత్రరాజ్యం సురేష్, శెట్టి శ్యామోహన్రావు గణపతి మండలిల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి.. ఎస్సై విక్రమ్



**సిరికొండ, సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని స్థానిక ఎస్సై విక్రమ్ సూచించారు.మండల కేంద్రంలోని 'యువ చైతన్య యూత్' గణేష్ మండపాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై యూత్ సభ్యులకు తగిన సూచనలు చేసి, సందేశాన్ని అందించారు. అనంతరం యూత్ సభ్యులు ఎస్సై విక్రమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. నిమజ్జనోత్సవం పూర్తయ్యే వరకు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని వారు తెలిపారు.?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, గ్రామస్తులు మరియు 'యువ చైతన్య యూత్' సభ్యులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య



**జన్నారం,సెప్టెంబర్20 (ప్రజాజ్యోతి)**మద్యం మానుకోవాలని కుటుంబ సభ్యులు మందలించడంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కలమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన మార్పుకోల అంజి (26) కూలి పని చేసుకుంటూ వచ్చిన డబ్బులను మద్యం తాగుతూ దుబారాగా తిరుగుతుండేవాడు. దీంతో అతనికి పెళ్లి కావడం లేదని కుటుంబ సభ్యులు మందు తాగడం మానేయాలని, మంచిగా పని చేసుకుంటే పెళ్లి అవుతుందని చెప్పగా, తాగుడుకు బానిసైన అంజి మనస్థాపానికి గురై జీవితంపై విరక్తితో శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు.ఈ విషయాన్ని అన్నయ్య వినయ్ కు చెప్పగా చికిత్స నిమిత్తం అంజిని జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి, లక్షెట్టిపేట, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వరంగల్ లోని ఏంజిఏం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం గంటలకు మృతి చెందాడని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ వివరించారు.

## జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలి

**విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి**

**-- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**ఖానాపూర్ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి)**నిర్మల్ జిల్లాలో వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గణేష్ మండపాల నిర్వాహకులు, నిమజ్జనంలో పాల్గొనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల సూచించారు.నిమజ్జన సమయంలో విద్యుత్ తీగలు, హైటెన్షన్ వైర్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. నిమజ్జనానికి విగ్రహాన్ని తరలించే సమయంలో హైటెన్షన్ వైర్ తగిలి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అన్నారు జిల్లాలోని అన్ని పట్టణాల్లో మండల కేంద్రాల్లో గ్రామాల్లో జరిగే నిమజ్జన కార్యక్రమానికి ఆయన మండపాల బాధ్యులు సమర్థవంతంగా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలనిఅన్నారు